ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 18 | సంచిక : 10 | జూన్ 2013

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు ......... 19-04-2013

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-04-2013, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భద్రాచలంలో ఉన్న రాముడిని రామనారాయణుడు అంటారు. భద్రుడికి ఇచ్చినమాటకోసం వైకుంఠం నుండి నారాయణుడే రాముడి రూపం ధరించి భద్రాచలం వచ్చాడు. ఈరోజు శ్రీరామనవమి. ఆయన ఏరోజున అయితే శరీరం ధరించివచ్చాడో ఆ రోజునే కళ్యాణం కూడా చేస్తారు. భద్రాచలానికి పదిమైళ్ళదూరంలో ఉన్న గ్రామంలో దమ్మక్కకు రాముడు స్వప్న దర్శనం ఇచ్చి, నేను ఫలానా కొండమీద ఉన్నాను అని చెప్పాడు. అప్పుడు ఆ గ్రామస్థులందరూ వెళ్ళి అక్కడ వెతికితే మొట్టమొదటగా దమ్మక్కకే ఆ విగ్రహాలు కనిపించాయి. తరువాత దమ్మక్క అక్కడ పందిరివేసి రోజూ పూజలు చేసి తాటికాయలు రాముడికి నైవేద్యంగా పెట్టేది. తరువాత రామదాసు అక్కడకు తహసిల్దారుగా వచ్చాడు. ఆయన కూడా రాముడిని చూడటానికి వెళుతూ ఉండేవాడు. నేను బీదరాలిని, రాముడికి గుడి కట్టించలేను. అందుచేత మీరు ఇక్కడ గుడి కట్టించటం మంచిదేమో అని దమ్మక్క రామదాసుగారికి సలహా చెప్పింది. అప్పుడు రామదాసు చుట్టుప్రక్కల గ్రామస్థులను పిలిచి దమ్మక్క గుడి కట్టించమంటోంది, నేను ధనవంతుడినికాదు, ఏమి చేద్దాము అని అడిగితే రైతులందరూ మేము డబ్బులిస్తాము అని చెప్పారు. అప్పుడు రామదాసు గుడి కట్టించి ప్రజలు కట్టిన పన్నులతో అంటే ప్రభుత్వధనంతో సీతారామలక్ష్మణులకు బంగారపు వస్తువులు కూడా చేయించాడు.

ప్రభుత్వడబ్బు ఉపయోగిస్తున్నాను, రైతులు డబ్బు ఇవ్వగానే మీకు జమచేస్తాను అని రామదాసు ఒక లెటరు కూడా వ్రాసి పెట్టాడు. ఆఫీసులో ఆయనకు విరోధులు ఉండటం వలన ఆ లెటరు తానీషాకు అందలేదు. ఆ సంవత్సరం వర్షాలు సరిగాలేక పంటలు పండకపోవటంవలన రైతులు డబ్బు ఇవ్వలేదు. రామదాసు ప్రభుత్వడబ్బు ఖర్చు పెట్టాడు అని తానీషాకు తెలియటం, రామదాసును జైలులో పెట్టటం జరిగింది. రామదాసు చేయించిన వస్తువులు ఇప్పడు కూడా ఉన్నాయి. భద్రాచలంలో ఈరోజు కళ్యాణం, రేపు పట్టాభిషేకం జరుగుతాయి.

ఉపనిషత్‌లలో విశేషం ఉంది, భగవద్గీతలో విశేషం ఉంది. రామాయణంలో ఏముంది అని కొంతమంది అంటూ ఉంటారు. రామాయణం గొప్ప గ్రంథం. రామాయణం చదివేటప్పడు అది ఒక కథ అనుకోకూడదు. అందులోనుండి నేర్చుకొనే విషయాలు చాలా ఉన్నాయి. మన తెలివితేటలు పెరగాలి అంటే, మనకు శీలం పెరగాలి అంటే, ఎవరి దగ్గర ఎలా మాట్లాడాలి, ఎవరి దగ్గర ఎలా ప్రవర్తించాలి, కుటుంబంలో ఎలా ఉండాలి, సమాజంతోటి ఎలా ఉండాలి ఈ విషయాలు అన్నీ తెలుసుకోవాలి అంటే రామాయణం పారాయణం చేసి తీరాలి. అసలు రక్షించేది రామాయణం అని చెపుతారు. మనకు ఇన్ని తెలివితేటలు ఉండి, ఇలా ప్రవర్తించాము ఏమిటి అని ఒకోసారి మనకి అనిపిస్తుంది. రామాయణం చదివితే అది మీకు బాగా తెలుస్తుంది. మనకు ఎన్ని తెలివితేటలు ఉన్నా ఒకో విషయం మనకు తట్టదు. వారికి ఈమాత్రం కూడా తెలియదా అని మనం అనుకొంటాము. అది తెలియదు అంతే. విధి బలీయమైనది. సైన్స్, టెక్నాలజీ ఎంత పెరిగినా మన తలరాతను ఎవరైనా మార్చగలరా? అది సాధ్యంకాదు. కలియుగంలో మీకేమైనా క్లేశాలు ఉంటే, అవి పోవాలి అంటే కేశవుడిని ఆరాధించండి, ఆయన పాదాలను ఆశ్రయించండి, మీకు క్లేశాలు తగ్గుతాయి అని చెపుతారు.

రామాయణంలో చాలా విచిత్రమైన సంఘటనలు జరుగుతాయి. మన జీవితానికి, రామాయణానికి చాలా పోలికలు ఉంటాయి. సీతను రావణాసురుడు దొంగతనంగా అపహరించుకొనిపోయాడు. ఎంతమంది తెలివితక్కువగా ప్రవర్తిస్తే తీసుకొనిపోయాడు. రాముడు అవతారపురుషుడు. బంగారపు లేడిని తెచ్చిపెట్టమని సీత అడిగింది. బంగారపు లేడి సృష్టిలో ఎక్కడా ఉండదు, అది బంగారపు లేడికాదు, అది మాయలేడి, చూడటానికి

అలా కనిపిస్తోంది అని భార్యతో చెప్పాలికదా! సీత అడిగితే బంగారపు లేడి వెనకాల పరిగెట్టటానికి ఆయన తెలివి తక్కువ వాడా? కాదు. కాని ఆ సమయంలో అలా ప్రవర్తించాడు. మానవరూపం ధరించేటప్పటికి దేవుడికైనా ఈ తిప్పలు తప్పవు. అటువంటి తెలివితక్కువ పనులు మనమూ చేస్తాము. లక్ష్మణుడిని కాపలా పెట్టి ఆయన లేడి వెంట పరుగెత్తాడు. మరి లక్ష్మణుడు కూడా అలాగే ప్రవర్తించాడు కదా! విధి బలీయమైనది. సూర్పణక రావణాసురుడి దగ్గరకు వచ్చి సీతమ్మ యొక్క అందం గురించి వర్ణించి చెపుతుంది. అప్పుడు మారీచుడు అంటాడు సీతమ్మ అంటే నిప్పు. ఆ నిప్పును రాముడు, లక్ష్మణుడు కాపలా కాస్తున్నారు. ఆ నిప్పు జోలికి మనం వెళ్ళకూడదు అని రావణాసురుడితో చెపుతాడు. నువ్వు మారువేషంలోవెళ్ళి రాముడిని దూరంగా తీసుకొనిపో అని మారీచుడికి రావణాసురుడు చెపుతాడు. అలా చేయటం తప్పు. రాముడు నీకు సామాన్యమానవుడిలాగ కనిపిస్తున్నాడు కాని ఆయన అతిబలవంతుడు, ఆయన జోలికి మనం వెళ్ళకూడదు అని మారీచుడు చెప్పాడు. రాముడు గొప్పవాడు, బలవంతుడు అని నీవు చెపుతున్నావు, తండ్రి పొమ్మంటే అడవికి వచ్చి చెట్లుచుట్టు, పుట్టలచుట్టు తిరుగుతున్నాడు, వాడు గొప్పవాడు ఏమిటి? అని రావణాసురుడు అంటే, అలాకాదు తండ్రి మాటను గౌరవించటానికి వెళ్ళాడుకాని ఆయనకు బలంలేకకాదు. పైకి ఎంత సామాన్యమానవుడిలాగ కనిపిస్తున్నాడో అంతశక్తిమంతుడు అని మారీచుడు చెపుతాడు. కాని రావణాసురుడు ఆ మాటలను పట్టించుకోలేదు.

వాలి భార్య తార చాలా తెలివైనది. తార వాలితో ఏమని చెపుతుంది అంటే నువ్వు యుద్ధానికి వెళ్ళవద్దు. సుగ్రీవుడు ఇప్పుడే నీతో ఓడిపోయి వెళ్ళి, మరల వచ్చి నిన్ను యుద్ధానికి పిలుస్తున్నాడు. దీని వెనకాల ఏదో కుట్ర ఉంది. వాడికి ఈ మధ్యన రామలక్ష్మణులతో స్నేహం కుదిరింది అని నాకు తెలుస్తోంది. ఓడిపోయి వెళ్ళినవాడు తిరిగివచ్చి నాతో యుద్ధానికి రా అని ఛాలెంజ్ చేస్తున్నాడు అంటే ఇప్పుడు మనం తెలివితేటలుగా ప్రవర్తించాలి. నువ్వు యుద్ధానికి వెళ్ళవద్దు అని తార సలహా చెపుతుంది. వాలి ఏమన్నాడు అంటే తారా నువ్వు నాకంటే తెలివైనదానివే, మంచి సలహా చెపుతున్నావు. కాని నా దగ్గర ఒక స్వభావం ఉంది. ఎవరైనా యుద్ధానికి రమ్మని పిలిస్తే నేను ఇంటి దగ్గర ఉండలేను, ఆ స్వభావం నేను

మార్చుకోలేను. యుద్ధానికి వెళ్ళి వాడిని చంపేస్తాను లేకపోతే వాడిచేతిలో చనిపోతాను అంతేగాని ఇంటి దగ్గర ఉండలేను. సుగ్రీవుడు నా తమ్ముడు, వాడిని చంపేశక్తి నాకు ఉన్నా, వాడు నా తమ్ముడు అనే అభిమానం పోవటంలేదు, వాడిని చంపే టైము వచ్చినా నేను చంపను, వాడిని తరిమేసి వచ్చేస్తాను అని తారతో చెపుతాడు. తార ఏమంది అంటే నువ్వు వాడిని చంపవు, వాడి వెనకాల అదనపుబలం ఉంది, వాడి చేతిలో నువ్వు చనిపోవచ్చు, అందుచేత ఇప్పుడు నువ్వు యుద్ధానికి వెళ్ళవద్దు అని చెప్పింది. రాముడు చాలా బుద్ధిమంతుడు, మర్యాదస్థుడు అని నేను విన్నాను, వాడికి నాకు ఎప్పుడూ వైరంలేదు. వాడు నిజంగా పెద్దమనిషి అయితే, దేవుడు అయితే వాడు వచ్చి నన్ను చంపుతాడా తారా, నువ్వు చెప్పే మాటలు నేను నమ్మలేకపోతున్నాను అంటాడు వాలి. అటువంటి రాముడు వాలిని చంపాడు. ఇందులో ఎవరిది రైటు అంటే మనం ఏమి నిర్ణయిస్తాము?

మనం అందరం పాడైపోవటానికి కోరిక, కోపం కారణం. వాలి చనిపోయేటప్పుడు సుగ్రీవుడు ఏడుస్తూ అంటాడు నీలాంటి గొప్ప అన్నగారు ఈ దుమ్ములో పడి ఉండటం నేను చూడలేకపోతున్నాను. చివరకు మనం ఇద్దరం పాడైపోయాము, నన్నేమో కోరిక పాడుచేసింది, నిన్ను కోపం పాడుచేసింది. నీలాంటి బలవంతుడిని రాముడిచేత చంపించటం నాది పొరపాటు అనిపిస్తోంది అని ఏడుస్తాడు. సీతాన్వేషణలో నీ సహకారం కావాలి అని నాతో స్నేహం చేయటానికి రాముడు వచ్చాడు. నేను రాముడితో ఏమన్నాను అంటే నేను నీకు ఉపకారం చేస్తాను నువ్వు కూడా నాకు ఒక పని చెయ్యాలి. మా అన్నయ్య వాలి నన్ను రాజ్యంలోనికి రానివ్వటంలేదు, వాడు మహాబలవంతుడు, నేను వాడిని చంపలేను, నువ్వు వాడిని చంపాలి అని చెప్పాను. నువ్వు నాకు ఉపకారం చేస్తున్నావు కాబట్టి నేను కూడా నీకు ఉపకారం చేస్తాను అని రాముడు చెప్పాడు. లేకపోతే వాలిని చంపటానికి వాడు రాముడికి ఏమైనా అపకారం చేసాడా? ఏమీ లేదు. సుగ్రీవుడికి ఇచ్చిన మాటకోసం వాలిని చంపాడు.

మనం సన్యాసుల మాటలు నమ్ముతాము కాని గృహస్థుల మాటలు నమ్మము. సీతమ్మను తీసుకొనిపోవటానికి రావణాసురుడు సన్యాసివేషంలో వచ్చాడు. ప్రజలను మోసం చేయటానికి సన్యాసి వేషాలు మంచివే. ఈ సందర్భంలో కంచిపరమాచార్య 35 సం॥ల క్రితం చెప్పిన మాటలు గుర్తుకు వస్తున్నాయి. ఆయన మద్రాసులో ఒక మీటింగులో

మాట్లాడుతూ శృంగేరి, కంచి, పూరీలలో ఆచార్యులవారు పీఠాలు స్థాపించారు. ఈ పీఠాలు స్థాపించి ఆయన ఏమని చెప్పారు అంటే మీరందరూ అన్న వస్త్రాలకు సరిపడ ప్రజలమీద ఆధారపడుతూ, మీరు వారికి భక్తి గురించి బోధించి, వారికి జ్ఞానామృతం పంచిపెట్టి, వారు ఏ ఆత్మగా ఉన్నారో ఆ స్వరూపాన్ని వారిచేత దర్శింపచెయ్యాలి, అది పీఠాధిపతుల పని అని చెప్పారు. ఏదో పీఠం ఉంది కాబట్టి దానిని పోషించుకోవాలి, దానికోసం మీ అన్నవస్త్రాలకోసం ప్రజలమీద ఆధారపడటం తప్పదు. ప్రజలు ఇచ్చింది పుచ్చుకుని మీ పొట్టను పోషించుకోండి, పీఠం మెయిన్‌టెనెన్స్ చూసుకోండి అని ఆచార్యులవారు చెపితే మేము ఎలా తయారయ్యాము అంటే ఈ మద్రాసులో నెల నుండి ఉన్నాము. మీరు ఎంత డబ్బు ఇస్తున్నారో, నేను ఎంత పుచ్చుకుంటున్నానో నాకే తెలియదు. ఆ డబ్బు అంతా మేము ఏమి చేసుకోవాలి. అక్కడ నుండి మాకు తింగరతనం వస్తుంది. కాలేజీలు పెడదామా, స్కూల్లు పెడదామా అని ఆలోచించటం. ఆచార్యులవారు చెప్పింది ఏమిటి? మేము చేసే పనులు ఏమిటి? అని ఆయనను ఆయనే తిట్టుకొన్నారు. పీఠాధిపతులు దేశం అంతా తిరిగి ప్రజలకు జ్ఞానాన్ని బోధించి, భక్తిని బోధించి వారిని మంచి మార్గంలో నడపాలి.

ఆచార్యులవారు సన్యాసికాకముందు కొంతకాలం భిక్ష చేసుకొన్నారు. భిక్ష ఎందుకు చేసుకొంటారు అంటే లోపల ఏదయినా గర్వం ఉంటే పోతుంది. ఎందుచేతనంటే ఆ టైములో కొంతమంది గృహస్తులు తిడుతూఉంటారు, ఆ మాటలు అన్నీ పడాలి. ఆచార్యులవారు భిక్ష చేసుకొనేటప్పుడు కాలడికి దగ్గరలో ఒక బీదరాలి ఇంటికి వెళతాడు. వారు దారిద్ర్యం అనుభవిస్తున్నారు. వారు బీదవాళ్ళు అని తెలుసుండి కూడా భిక్ష వెయ్యమని అడిగాడు. ఆవిడ ఉత్తమురాలు. మనకు ఉన్నదానిలో ఎదుటివారికి ఇవ్వాలి అనే స్వభావం ఆవిడకు ఉంది. ఆవిడ అటు ఇటు తిరుగుతోంది, ఇవ్వటానికి ఏమీ కనబడటంలేదు. అప్పుడు ఆచార్యులవారు పిల్లవాడే. చివరకు ఒక పాడైపోయిన ఉసిరికాయ ఒక మూలన దొరకుతుంది. అప్పుడు ఆ ఉసిరికాయను తెచ్చి ఆచార్యులవారికి ఇస్తుంది. ఆ కుటుంబంలో ఉన్న దారిద్ర్యాన్ని చూసి వారిని అనుగ్రహించాలి అనుకొన్నాడు. అక్కడ ఉసిరికాయ ముఖ్యంకాదు, దానివెనకాల ఉన్న ప్రేమ, భక్తి, ఆప్యాయత అది ముఖ్యం. అప్పుడు ఆచార్యులవారు లక్ష్మీదేవిని ప్రార్థిస్తారు. లక్ష్మీదేవి ఏమి చెప్పింది అంటే ఈ కుటుంబానికి పైసాలు ఇవ్వమంటున్నావు. పూర్వజన్మలో వీరు ఎవరికీ

ఏమీ ఇవ్వలేదు, మంచి చేయలేదు. ఇప్పుడు నువ్వు డబ్బులు ఇవ్వమంటే ఎలా ఇస్తాను అంది. ఆచార్యులవారు ఏమన్నారు అంటే పూర్వజన్మలలో ఎవరికీ ఏమీ ఇవ్వలేదు అని చెపుతున్నారు, ఇప్పుడు నాకు ఉసిరికాయ ఇచ్చిన మాట నిజమా, అబద్దమా అని లక్ష్మీదేవిని అడిగారు. నిజమే అని చెపుతుంది. పూర్వ జన్మల గొడవ వద్దు, ఇప్పుడు నాకు ఉసిరికాయ ఇచ్చారు కాబట్టి వారిని అనుగ్రహించు అని లక్ష్మీదేవిని స్తోత్రం చేస్తే అప్పుడు దేవి వారిని అనుగ్రహించింది. అప్పటి నుండి ఆ కుటుంబం ఐశ్వర్యంతోటి ఉన్నారు. ఈ జన్మలో మనకు ఉన్నదానిలో ఇతరులకు పెట్టకపోతే వచ్చే జన్మలో మనం దారిద్ర్యం అనుభవించక తప్పదు, అది దేవుని చట్టం. కొంతమంది ఏమంటారు అంటే మీరు ఆంధ్రాబాంక్‌లో డబ్బు దాచుకుంటున్నారు అలాగే దేవునిబాంక్‌లో కూడా కొంత డబ్బు వేసుకోండి అని చెపుతారు. అంటే ఇతరులకు మీరు చేసిన సహాయం, వారి మంచి కోసం మీరు చేసేది అంతా దేవునిబాంక్‌లో జమ అవుతుంది. మరణానంతరం ఇక్కడ ఆంధ్రాబాంక్‌లో ఉన్న డబ్బు చెల్లదు, దేవునిబాంక్‌లో ఉన్న డబ్బు ఈ జీవుడు అనుభవించవచ్చు. స్టేట్‌బాంక్‌లోగాని, ఆంధ్రాబాంక్‌లోగాని ఉన్న డబ్బు మరణానంతరం మీకు ఉపయోగపడదు. ఆ బ్యాంక్‌లలో ఎంత డబ్బు ఉన్నా మీ వారసులు తినేస్తారు. తినేసినా ఫరవాలేదు, తినేసి మిమ్మల్ని తిడతారు.

సీతమ్మ అడిగింది అని రాముడు బంగారు లేడి వెంట పరుగెత్తటం, లక్ష్మణుడిని కాపలాగా పెట్టి వెళితే ఆయన కూడా సీతను విడిచిపెట్టి వెళ్ళటం, లక్ష్మణుడు గీచిన గీతను దాటి సీత వెళ్ళటం ఈ ముగ్గురు అలా ప్రవర్తించటం వలన సీత రావణాసురుడిచేత అపహరించబడింది. ఎవరిది తప్ప అంటే మనం ఏమి చెప్పగలం? తలరాతను ఎవరు మార్చగలరు? రావణాసురుడు సీతను అపహరించుకొనిపోతూ ఉండగా జటాయువు చూసాడు. పెరుమాళ్ళు యొక్క భార్యను తీసుకొనిపోతూ ఉంటే మనం కూర్చుని ఉంటే ఎలాగ అని రావణాసురుడితో వీరోచితంగా పోరాడింది. రావణాసురుడు తనకంటే మహాబలవంతుడు అని ఆ ముసలి పక్షికి తెలుసు. అయినా అతనితో పోరాడింది. తన రెక్కలతో, కాళ్ళతో రావణాసురుడితో గట్టిగా పోరాడింది. ఎంత గట్టిగా పోరాడింది అంటే ఆయన రథాన్ని పడగొట్టేసింది, వాడు కూడా కిందకి దిగక తప్పలేదు. అప్పుడు రావణాసురుడు ఆయుధం తీసి జటాయువు రెక్కలను, కాళ్ళను నరికేసాడు. రెక్కలు, కాళ్ళు పోయినా ప్రాణం

శరీరాన్ని అంటిపెట్టుకొని ఉంది. అలా ప్రాణం శరీరాన్ని ఎందుకు అట్టిపెట్టుకొని ఉంది అంటే సీతను తీసుకొని వెళ్ళినవాడు రావణాసురుడు, దక్షిణ దిక్కుగా తీసుకొనిపోయాడు అని రాముడికి చెప్పటానికి ప్రాణం నిలబెట్టుకొన్నాను అంతకంటే ఈలోకంలో నాకు పనిలేదు అని జటాయువు చెప్పింది. రాముడికి చెప్పవలసిన వర్తమానం చెప్పాక శరీరాన్ని విడిచిపెట్టేసింది. జటాయువు చెప్పిన మాటలు విని రాముడు, లక్ష్మణుడు భూమిమీద దొర్లి ఏడ్చారు అని వాల్మీకి వ్రాసాడు. ఏమి సంబంధం ఉందని రాముడికోసం జటాయువు ప్రాణాలను ఇచ్చింది. పెరుమాళ్ళుకోసం ప్రాణాన్ని త్యాగం చేసినటువంటి జటాయువు మనకు ఆదర్శం. ఇతరులకు అన్నం పెట్టవచ్చు, డబ్బు ఇవ్వవచ్చు కాని ఇతరులకోసం ప్రాణాన్ని ఇవ్వటం కష్టం కదా. ఓ జటాయువు దశరథుడు నాకు శరీరాన్ని ఇచ్చాడు కాని నువ్వు నాకోసం నీ ప్రాణాన్ని ఇచ్చావు అని అంటూ లక్ష్మణా నువ్వు పుల్లలను తీసుకొనిరా, నేనే చితికి నిప్పు పెడతాను అని రాముడు చెప్పాడు. చితికి నిప్పు పెడుతూ ఓ జటాయువూ మహర్షులు, మహాత్ములు, యోగులు, గొప్పగొప్ప తపస్సులు చేసినవారు, రాగద్వేషరహితులు ఏ లోకాలకు వెళుతున్నారో అటువంటి ఉత్తమలోకాలకు వెళ్ళు జటాయువు, ఇది రామఆజ్ఞ అంటాడు రామచంద్రమూర్తి.

మండోధరి ఏమని చెపుతుంది అంటే రావణా నువ్వు గొప్ప వీరుడవు, దేవతలను కూడా జయించావు, నీ కొడుకు ఇంద్రుడిని జయించాడు, నువ్వు చేసిన యుద్ధాలలో జయం పొందినమాట నిజమే. కాని నువ్వు రాముడిని మానవమాత్రుడు అనుకొంటున్నావు. ఒక్కసారి వెనక్కివెళ్ళి చూడు. ఎత్తినవిల్లు దింపకుండా, లక్ష్మణుడి సహాయంకూడా తీసుకోకుండా 14వేలమంది రాక్షసులను చంపాడు, గొప్పగొప్ప వీరులను మట్టిలో కలిపేసాడు, ఆ సంఘటన గుర్తుకు రావటంలేదా? రాయబారిగా వచ్చిన ఒక వానరుడు లంక అంతా అల్లరి చేసిపోయాడు. వాడికే అంతబలం ఉంటే ఇంక రాముడికి ఎంత బలం ఉంటుందో చూసుకో అంటుంది మండోధరి. ఒక మనిషి మీదకు యుద్ధానికి వెళ్ళినప్పుడు వాడి బలం ఏమిటి అని ముందు మనం చూసుకోవాలి కదా? మనకు సామాన్యమానవుడిగా కనిపించినా, మహావిష్ణువే రాముడి రూపంలో వచ్చాడు అని చెపుతారు. పోనీ అది నిజం కాకపోయినా ఇప్పుడు మనం భౌతికంగా లెక్కపెట్టుకొన్నా ఇంతకుముందు చాలామంది రాక్షసులను చంపటం మనం చూసాము కదా అంటుంది మండోధరి.

రాముడిలాంటి సోదరులు యింతవరకు మరల పుట్టలేదు. ఆస్థులు మాకు కావాలి అంటే, మాకు కావాలి అని ఇప్పుడు పేచీలు పెట్టుకొంటున్నారు. ఆస్థి మాకు వద్దు అంటే మాకు వద్దు అన్నారు రాముడి అన్నదమ్ములు. ఇప్పుడు పేచీలు అన్నీ ఆస్తులకోసమే కదా. అక్కా చెల్లెళ్ళు పేచీలు, అన్నదమ్ముల పేచీలు ఎక్కడ చూసినా పేచీలే. భగవంతుడు మాయనంతా అక్కడా ఇక్కడా పెట్టకుండా మొత్తం అంతా డబ్బులోనే పెట్టేసాడు అని వాల్మీకి మహర్షి రామాయణంలో చెప్పాడు. రామాయణంలో ఇటువంటి రత్నాలు ఎన్నో ఉన్నాయి. రామాయణంలో ఏమీలేదు అనుకొంటున్నారు. అసలు మీకు తెలివితేటలు పెరగాలంటే మీ జీవితవిధానం బాగుపడాలి అంటే రామాయణం చదివితీరాలి. రామాయణంలో ఏముంది అంటే అసలు మీరు చదివితే కదా తెలిసేది, అసలు దిగకుండా లోతు ఎలా తెలుస్తుంది. కుంభకర్ణుడు రావణాసురుడితో ఏమన్నాడంటే నువ్వు సీతను ఎత్తుకురావటం తప్పలేదు. ఎందుచేతనంటే మనం రాక్షసులం కాబట్టి అటువంటి పనులే చేస్తాము. కానీ దొంగతనంగా తీసుకొని రావటం తప్పు. నువ్వు ఒక దేశానికి రాజువు. రాముడినీ, లక్ష్మణుడినీ చంపి నువ్వు సీతను తీసుకొని రావాలి. అప్పుడు నువ్వు ఎంత వీరుడివో సీతమ్మ చూసి నిన్ను వరించునేమో? నువ్వు దొంగతనంగా తీసుకొని వచ్చి నన్ను వరించు అంటే సీత నిన్ను ఏమి వరిస్తుంది అంటాడు. రావణాసురుడికి చాలామంది భార్యలు ఉన్నారు. రావణాసురుడికి భార్యగా ఉండమని సీతను ఒప్పించడానికి ఆయనతో పాటు కోటలో ఉన్న స్త్రీలు వెళుతూ ఉంటే రావణాసురుడి భార్యలలో ఒక భార్యకూడా వెళుతుంది. మిగిలిన స్త్రీలు అందరూ సీతతో రావణాసురుడు మహారాజు, విపరీతమైన ఐశ్వర్యవంతుడు. ఐశ్వర్యం వచ్చి నీ నెత్తిమీద పడుతూ ఉంటే వద్దంటావేమిటి అని చెప్పారు. సీతమ్మ ఏమని చెప్పిందంటే నాకు పెళ్లి అవ్వకముందు నన్ను పెళ్లిచేసుకో అని మీరు అడగటంలో అర్థం ఉంది. యిప్పుడు నాకు పెళ్లి అయిపోయింది. నేను ఇప్పుడు ఒక మనిషికి భార్యగా ఉన్నాను. మరల ఇప్పుడు నాకు భార్యగా ఉండు అని మీరు అడిగితే అది ఎలా కుదురుతుంది అని చెప్పింది. అప్పుడు రావణాసురుడి కూడా వచ్చిన ఆయన భార్య ఏమని చెప్పిందంటే అది ఒక మానవ స్త్రీ, అన్నం తినటం మానేసి ఎండిపోయి ఉంది, ఎముకలే మిగిలిఉన్నాయి, ఆ ఎముకలను కోటలోనికి వేసుకొని వస్తావా అంది. అయినా నిన్ను పెళ్లిచేసుకోవటం ఆమెకు ఇష్టంలేదు.

యిష్టం లేని స్త్రీని ఎప్పడూ పెళ్ళిచేసుకోకూడదు. యిష్టంలేని స్త్రీని పెళ్ళిచేసుకొని నువ్వు ఏమి ఎంజాయ్ చేయగలవు, ఎంజాయ్‌మెంట్ ఏమీ ఉండదు, వెళ్ళిపోదాంరా అని రావణాసురుడిని తీసుకొని పోయింది. మనం అయినా అంతే. అమ్మాయికి మనం అంటే ఇష్టంలేనప్పడు ఒకవేళ పెద్దలు ప్రోత్సహించినా పెళ్ళిచేసుకోకూడదు. ఇటువంటి ఎన్నో విషయాలు రామాయణంలో వాల్మీకి చెపుతాడు. రామాయణం అంటే ప్యూర్‌గోల్డ్. మనం బాగుపడటానికి రామాయణం చాలు, వంద గ్రంధాలు అక్కరలేదు, రక్షించేది రామాయణం అని చెపుతారు. రాముడు ఒక్కడికే మర్యాదపురుషోత్తముడు అని పేరు. ఒకరోజున రావణాసురుడు యుద్ధం చేస్తూ ఉంటే ఆయన రథం విరిగిపోయింది, గుఱ్ఱాలు చనిపోయాయి, చేతిలో ఉన్న ఆయుధాలు అన్నీ పోయాయి. అప్పడు రాముడు ఏమన్నాడుఅంటే రావణా ఇప్పడు నీకు రథంలేదు, ఆయుధాలు లేవు, కిందపడి ఉన్న వాడితో యుద్ధంచేసి చంపటం న్యాయం కాదు. ఈ రోజు యింటికి వెళ్ళిపో. రేపు కొత్త రథంతో, గుర్రాలతో, ఆయుధాలతో రా అని చెపుతాడు. అలా ఎవడు చెపుతాడు? ఆయన మర్యాదపురుషోత్తముడు.

శ్రవణం చెయ్యకుండా సబ్జక్టు ఎలా తెలుస్తుంది. మీరు శ్రవణం చెయ్యాలి. ఇంటికి వెళ్ళిన తరువాత శ్రవణం చేసిన విషయాలను మననం చేయాలి. స్మరణవలన మాత్రమే మనం పవిత్రులం అవుతాము. చెవులతో వినకుండా మనస్సు ఎలా స్మరిస్తుంది. ఏదో నాలుగు ముద్దలు తింటే అరగటం, అరగకపోవటం అనేది. ఏమీ తినకుండా ఇంక అరగటం ఏమిటి? ఏదో నాలుగు మంచిమాటలు వింటే వాటిని స్మరించుకోవచ్చు. అసలు వినాలికదా. పరమాత్మను స్మరించుకొంటే మనం పవిత్రులం అవుతాము. మనం పవిత్రులం అవ్వకుండా మనకు బ్రాహ్మీస్థితి కలుగదు. మనం రోజూ చేతులతో ఎన్నో పనులు చేస్తున్నాము. పరమాత్ముడి దయను సంపాదించటానికి ఒక్క పని అయినా చేస్తున్నామా? 24గంటలు మన సంసారపనులు చూసుకొంటున్నాము కాని పరమాత్మ దయను పొందటానికి కనీసం ఒక్క చిన్నపని అయినా చేస్తున్నామా? ఏమీలేదు. నోటితో మంచి మాటలు లేవు, అన్నీ తింగరమాటలే. మనకు భావశుద్ధిలేదు, మానసికశుద్ధిలేదు. యుక్తుడు, అయుక్తుడు అని భగవద్గీతలో చెపుతాడు. యుక్తుడు అంటే ఏకాగ్రత ఉన్నవాడు, అయుక్తుడు అంటే ఏకాగ్రత లేనివాడు. ఏకాగ్రత పెంచుకోవటానికి నీవు ప్రయత్నం చేస్తున్నావా. జపంలేదు, ధ్యానం లేదు, ఎంతసేపూ ఏదో గ్రామంలోని గొడవలతో,

దేశంలోని గొడవలతో కాలక్షేపం చేస్తున్నావు. పరమేశ్వరుని అనుగ్రహం పొందటానికి నీ మనస్సును ప్రిపేర్ చేస్తున్నావా? నువ్వు చేసేవి తింగరపనులు, ఆశించటం మాత్రం దేవుని దయను ఆశిస్తున్నావు, ఇంక దేవుని దయనీకు ఎలా కలుగుతుంది.

మండోదరి రావణాసురునితో అంటుంది రావణా నువ్వు మంచి వాడవు అయినా, చెడ్డవాడవయినా నువ్వు నా భర్తవు. నువ్వు మహారాజువు, గొప్ప ఐశ్వర్యవంతుడవు. నువ్వు సీతను తీసుకొని వచ్చావా లేకపోతే నిప్పును తీసుకొని వచ్చావా, ఈ లంకను తగలబెట్టటానికి మైడియర్ హజ్‌బెండ్ అంటుంది. రావణా! నీకు నేను ఎన్నో మంచిమాటలు చెప్పాను, కానీ నువ్వు వినలేదు. ఎందుచేతనంటే విధి బలీయమైనది. నీ వంటి మీద ఉన్న డెస్టినీ నేను చెప్పిన మంచి మాటలను విననివ్వలేదు, నువ్వే చేస్తావు. నువ్వు ఎంత మహరాజువు అయినా, ఎంత బలవంతుడవయినా డెస్టినీ ముందు నీ శక్తి సరిపోదు, నువ్వు తలవగ్గవలసిందే అని చెప్పింది. మనం బాగుపడటానికి రామనామం చాలు. రోజూ ఒక గంట రామనామం చేస్తూంటే వివేకం పెరుగుతుంది, ఏకాగ్రత పెరుగుతుంది. నీ బుద్ధి బాగుపడుతుంది. రామనామస్మరణ వలన నీ మనస్సులో మంచి ఆలోచనలు, పవిత్రమైన ఆలోచనలు వస్తాయి. గాంధీగారు ఎప్పడూ రామనామం విడిచిపెట్టలేదు. ఆయనను కాల్చి చంపినప్పడు కూడా హేరామ్, హేరామ్ అన్నారు.

మనకు తినటానికి అన్నంకావాలి, కట్టుకోవటానికి బట్టకావాలి, ఏదో నీడ ఉండాలి. ఇటువంటి ప్రాథమిక అవసరాలు కాకుండా మన జీవితంలో లేనిపోని సంకల్పాలు, అవసరం లేని కోరికలు వస్తూ ఉంటాయి. ఆ కోరికలను బట్టి భోగవాంఛ వస్తుంది. ఇటువంటి అవసరంలేని కోరికలు నీ మనస్సులో వస్తూ ఉంటే వాటిని సగంసగంగా కాదు, పూర్తిగా శేషం లేకుండా విడిచిపెట్టు అని పరమాత్మ చెపుతున్నాడు. ఆ కోరికలు నీకుగాని, నీ కుటుంబానికిగాని, దేశానికిగాని దేనికీ పనికిరావు. అటువంటి కోరికలు నీలో ఏమైనా ఉన్నాయేమో చూసుకో, ఉంటే వాటిని శేషం లేకుండా విడిచిపెట్టటానికి ప్రయత్నం చెయ్యి. ఆత్మలో ఆత్మతోటే రమిస్తూ ఆత్మలోనే సంతృప్తి అయి ఉండటం అలవాటు చేసుకో. మీకు అందరికీ నేను ఉంది కదా! ఆ నేను లోపల ఉందా? బయట ఉందా? అది లోపలే ఉంది. ఆ నేను యొక్క మూలంలోనే పరమాత్మ ఉన్నాడు. ఆ నేను యొక్క మూలాన్ని తెలుసుకుంటే

పరమాత్మ దొరుకుతాడు. అందుచేత మీరు లోపల వెదికితే దాని మూలం మీకు తెలుస్తుంది కాని బయట వెదకటం వలన అది మీకు దొరకదు. ఆ నేను యొక్క మూలంలో ఏ వస్తువు అయితే ఉందో ఆ వస్తువు యొక్క స్వరూపాన్ని పొందటమే జ్ఞానం, అది అనుభవైకవేద్యం. ఇప్పుడు మీరు పొందే ఎంజాయ్‌మెంట్స్ ఏమీ నిజంకాదు, మీ అనుభవం ఒక్కటే నిజం.

నదులు అన్నీ వెళ్ళి సముద్రంలో కలుస్తాయి. అవి వచ్చి నాలో కలవాలని సముద్రం అనుకోదు. నదులన్నీ వచ్చి కలవటం వలన సముద్రం ఏమీ పెరగదు. ఒకవేళ నదులకు కోపం వచ్చి అవి సముద్రంలో కలవకపోయినా సముద్రం ఏమీ తగ్గదు. జ్ఞానికి కోరికలు ఏమీ ఉండవు. ఒకవేళ మన దృష్టిలో వాడు అనుకొన్నవి అన్నీ నెరవేరుతున్నప్పటికీ వాడికి అదనంగా సంతోషం ఏమీరాదు. ఒకవేళ కోరికలు నెరవేరకపోయినా వాడు ఏమీ వికారం పొందడు. ఎందుచేతనంటే ఈ సంతోషాలకు, వికారాలకు అతీతమైన శాంతి సముద్రంలో వాడు ఊగిసలాడుతూ ఉంటాడు, వాడు జ్ఞాని, వాడు వికారరహితుడు. వాడికి ఒక పని జరగటం వలన లాభం లేదు, జరగకపోవటం వలన వాడికి వచ్చే నష్టం లేదు. ఎవరింటికి వెళ్ళి చూసినా రాగద్వేషములు తప్ప ఏముంది? మేడలో ఏముంది? తాటాకు ఇంటిలో ఏముంది? మేడలో ఏమి చేసుకొంటున్నారో, తాటాకు ఇంటిలో కూడా అదే చేసుకుంటున్నారు. చూడటానికి అది తాటాకు ఇల్లు, ఇది మేడ అంతే. చేసుకొనే పనులు ఒక్కటే, అందరిలో ఉన్న రాగద్వేషములు ఒక్కటే. మీకు ఆత్మానుభవం లేనప్పుడు అంత గర్వంగా చెప్పకోవటానికి మీకు ఏముంది? ఒకవేళ ఏదైనా ఉంది అని మీరు అనుకొన్నా, అవి తాత్కాలికం, అవి కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి.

మనకు ఇంద్రియాలు ఉన్నాయి. అవి బయట తిరుగుతూ లోకంలో ఉన్న భోగాలను అనుభవిస్తున్నాయి. ఈరకంగా జీవిస్తూ ఉంటే మనకు జ్ఞానం కలుగదు. ఇప్పుడు ఇంద్రియాలు ఎంత సహజంగా బాహ్యముఖంగా వెళుతున్నాయో, అంత సహజంగా అవి అంతర్ముఖం అవ్వాలి. తాబేలు ప్రమాదం వస్తోంది అని గ్రహిస్తే ఇంద్రియాలను సడన్‌గా, అతి తేలికగా లోపలకు లాగేసుకుంటుంది. అలాగ మీరు కూడా విషయాలలో నుండి మీ ఇంద్రియాలను లాగేసుకోండి. ఇది చెప్పటం తేలిక, చేయటం చాలాకష్టం. పోనీ తాబేలు అంత తేలికగా, సడన్‌గా మీరు లోపలకు లాక్కోలేకపోయినా మీ ఇంద్రియాలను, మనస్సును నెమ్మదిగా

అంతర్ముఖం చేయటానికి ప్రయత్నం చేయండి. రాముడు ఉన్నచోట కామం లేదు, కాముడు ఉన్నచోట రాముడు ఉండడు. ఎంజాయ్‌మెంట్, పెర్‌ఫెక్షన్ అనేవి రెండు వేరువేరు విషయాలు. ఎంజాయ్‌మెంట్ తీసుకొని వెళ్ళే ప్లేస్ వేరు, పెర్‌ఫెక్షన్ తీసుకొని వెళ్ళే ప్లేసు వేరు. ఇందులో ఏ రోడ్డు ద్వారా వెళితే ఆ చివరకు వెళతావు. ఇప్పుడు ఇంద్రియాలు విషయాలను ఎంత సహజంగా అనుభవిస్తున్నాయో, అంత సహజంగా ఇంద్రియాలు, మనస్సు హృదయంలోనికి అంతర్ముఖం అవ్వాలి. ఇంద్రియాల దగ్గర మనస్సు లేకపోతే నువ్వు వాటితో భోగాలను అనుభవించినా నీకు ఎంజాయ్‌మెంట్‌రాదు. ఇంద్రియాలు, మనస్సు అంతర్ముఖం అయ్యి హృదయంలో ఉన్న శాంతిసాగరంలో, ఆనందసాగరంలో లయమైన తరువాత ఇంక వాటి వలన ప్రమాదం లేదు. అప్పుడు నీ దేహప్రారబ్ధాన్నిబట్టి ఒకవేళ భోగాలు వచ్చి నీమీదపడినా భోగాలను అనుభవిస్తున్నాను అని నీకు అనిపించదు. ఎందుచేతనంటే అనుభవించేవాడు అక్కడలేడు. భోగాలు అనుభవించేటప్పుడు మనకు సంతోషం వస్తుంది కదా అదే భోగం వచ్చి జ్ఞానిమీద పడినా వాడికి రవ్వంతకూడా సంతోషం రాదు. ఎందుచేతనంటే సంతోషం కోసం వాడు దానిమీద ఆధారపడిలేడు. మీరు ఎవరినీ ఏమీ అనవద్దు. ఎవరికైనా ఏదైనా చెపితే పాజిటివ్‌గా చెప్పండి కాని నెగెటివ్‌గా చెప్పకూడదు. వాక్‌శుద్ధి ఉండాలి.

ఈ శరీరం భూమి మీద తిరుగుతున్నప్పుడే మన హృదయంలో ఉన్న చావులేని సద్వస్తువును మీరు అనుభవంలోనికి తెచ్చుకోవాలి. ఇప్పుడు మీరు చేసిన కర్మలు అనుభవించటానికి శరీరం మరణించాక ఏదో లోకానికి వెళతారు, శరీరం మరణించిందా ప్రయాణం ప్రారంభమవుతుంది. పూర్ణశాంతి, పూర్ణసుఖం పొందటానికి శరీరం మరణించే వరకు ఆగనక్కరలేదు, ఈ శరీరం ఉండగానే ఆత్మానుభవం పొందాలి. తరువాత మీరు చేసేది ఏమీలేదు. అందుచేత కాలాన్ని వృధాచేసుకోవద్దు. సత్పురుషుల సహవాసం విడిచిపెట్టవద్దు. పనిచేయండి. ఆసక్తి పెట్టుకోవద్దు. సమాజానికి తోటిమానవులకు ఎంతోకొంత ఉపయోగపడండి. ఇతరులు ఎవరికీ ఉపయోగపడని జీవితం జీవిస్తూ ఉంటే అది కూడా ఒక జీవితమేనా? ఆచార్యులవారు ఏమన్నారు అంటే అద్దం క్లీన్‌గా ఉంటే సరిపోదు, అది కదలకుండా ఉండాలి. అలాగే మా మనస్సు శుభ్రంగా ఉందండి అంటే సరిపోదు, అది కదలకుండా ఉండాలి. మనస్సులో వేవరింగ్ లేకుండా ఉంటేనే పరమాత్మ అందులో ప్రతిబింబిస్తాడు.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

## శ్రద్ధాంజలి

పుడమి తల్లికి ఋణము తీర్చిన
సుబ్రహ్మణ్య అవతారుడైన
శ్రీ నాన్న గురుదేవులకు జన్మనిచ్చిన
ఓ తల్లీ ఇదే మా శ్రద్ధాంజలులు

చల్లని వెన్నెల కన్నా చల్లతనముతో
హృదయశాంతినిచ్చే పరమ
శాంత పురుషునకు జన్మనిచ్చిన
ఓ తల్లీ ఇదే మా శ్రద్ధాంజలులు

తేనె పలుకుల వంటి బోధనలతో
భక్త జనుల హృదయాలు నింపిన
దివ్యపురుషునకు జన్మనిచ్చిన
ఓ తల్లీ ఇదే మా శ్రద్ధాంజలులు

మానవాళి హృదయాలను తట్టి తట్టి లేపి
జ్ఞాన జ్యోతిని వెల్గించిన
జ్ఞానమూర్తికి జన్మనిచ్చిన
ఓ తల్లీ ఇదే మా శ్రద్ధాంజలులు

**గిరిజ, హైదరాబాదు**

# “భయంలేనిది, భ్రాంతిలేనిది - బ్రహ్మ ఒక్కటే”

పరమసత్యం ఒక్కటే అయినప్పటికీ మనకు నామరూప, గుణకర్మలుగా అనేకంగా కనిపిస్తున్నది. అది మనస్సు యొక్క కల్పన, భ్రమ. ఈ ఊహాకల్పనల మనస్సు ఒక పక్కన పెట్టలేక సత్యాన్ని గుర్తించలేకుండా ఉన్నాము. మనం ముక్కలు ముక్కలుగా ఉండకుండా నిరామయంగా ఉండాలంటే బాహ్యవస్తుమయ ప్రపంచంలో లభ్యమయ్యే ఆనందం కంటే చాలా గొప్ప ఆనందం తనలోనే ఉందనే విశ్వాసం ఉండాలి. బాధలతో, భయాలతో, భ్రాంతులలో, ఆందోళణతో, కోరికల కల్లోలంతో కూడిన ఆలోచనా ప్రవాహం ఆగినప్పడు, మనస్సు తన రూపాన్ని కోల్పోయి స్వస్వరూపంలో నిలుస్తుంది. ప్రకృతిలో మనం నిత్యం మన మనస్సును సరియైన విధానంలో అదుపులో ఉంచకోకపోతే ఏదో ఒక వస్తువును పొందాలనే ఉంటుంది. దాన్ని పవిత్రమైన, దివ్యమైన భావాలపై ప్రయత్నించి నియమిస్తూ ఉండాలి. భక్తియోగంలో గురువుపై మనస్సు ఆకర్షితమౌతుంది. అప్పుడు అన్నివైపులనుండి విముక్తమౌతుంది. ఇంద్రియభోగ్య వస్తువుల వాసనలు మనలో ఉండి అత్యంత ఆకర్షణీయంగా మనకు కనిపిస్తాయి. అవి రావటం సహజం కాని వాటిని మమకారంతో ప్రోత్సహించకూడదు. ఆ గుణాలులేకుండా అసలు మనస్సు ఉండదు. వాటిని అంతం చెయ్యాలంటే మన ఇష్టదైవం పాదపీఠంపై ఆర్తితో వాటిని అక్కడ నివేదించాలి అది ఒక్కటే పరిష్కారమార్గం. దానితో ఆయన్ని పొందాలనే తీవ్రకోరికగా మారిపోతుంది. గురునామ, రూపాలపైన మన దృష్టిని మరల్చితే వాటి వాసనలకు మనస్సు దూరమైపోతుంది. లేకపోతే భ్రాంతులు ‘సంజీవిని’ వలె మనస్సును బ్రతికించి పునర్జన్మలెత్తేలా చేయిస్తుంది వాటికి నీళ్ళుపోస్తే పూలు పూసి కాయలు కాసి ఆ విత్తనాలు మనలో భద్రంగా ఉండి అవకాశం కోసం ఎదురుచూస్తాయి. అప్పుడు మనం ఏమి చెయ్యలేము. కాని గురుకరుణ ఉంటే అవ్యక్తమయ్యే తీరును మాత్రం మనం ప్రయత్నించి తొలగించగలము. దానికి ఆరోగ్యకరమైన దారిలో వ్యక్తమయ్యేటట్లు మార్చే శక్తి మన చేతుల్లో ఉంది. అది పట్టుదలపై ఆధారపడి ఉంటుంది. దానికి ప్రేమ, దయ, సహనం, క్షమ మొదలైన గుణాలు మనలోనుండి వ్యక్తమయ్యేలా చూసుకోవచ్చు అలా ఉంటే ప్రపంచంపై మన దృష్టి మారిపోతుంది. కాని దుష్టవాసనలను నిర్లక్ష్యంచేస్తే మనం పిచ్చిగా ప్రవర్తిస్తాము. వాటిని అదుపులో ఉంచాలంటే దైవీసంపద వృద్ధిచేసుకోవాలి. అప్పుడు అవి నశిస్తాయి. పొరపాటున ఒక్కక్షణం ప్రకృతిలో పడిందా? ఎంతదూరం కొట్టుకుపోతామో మనకే తెలియదు. స్వభావతః మనస్సు బాహ్యా ముఖానికి పోవటానికి ప్రయత్నిస్తుంది. దాన్ని సత్సంగముతో సంధానం కల్పిస్తే స్థిరత్వం అవుతుంది. వైరాగ్యాన్ని స్వప్రయత్నంతో సంపాదించాలి. అప్పుడు పరిస్థితులకు లొంగిపోని స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తాము. రారాజుగా ఆనందంగా సుఖంగా జీవించటానికి అవకాశం ఉంటుంది. మోక్షమే శ్రేయస్సు. దాన్ని పొందాలంటే గురు ఒడిలో కూర్చొని (ఆయన కల్యాణ గుణాలతో కూర్చొని) ప్రపంచాన్ని చూస్తే దుఃఖం ఎక్కడ? భయం ఎక్కడ? భ్రాంతి ఎక్కడ? ఏది అపవిత్రం అంతా “శివమయం’ అంటారు పెద్దలు

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**